
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండండి



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 1, ప్రభాతవార్త:** నగరవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ధీటుగా ఎదుర్కొనేందుకు నగరపాలక సంస్థ సిద్ధంగా ఉందని కమిషనర్ డి.హరిత తెలిపారు. బారీ వర్షాలకు నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రధాన డ్రైను మార్గాలు, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలు, అండర్ బ్రిడ్జిల పరిస్థితిని అధికారులతో కలిసి కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో కార్పొరేషన్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు ఆదేశాల మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి బాధితుల నుంచి సమాచారం తెలుసుకుంటున్నామని తెలిపారు. వర్షాల నేపథ్యంలో సమస్యలు కలిగిన వారు టోల్ ఫ్రీ నెంబర్లు 18004251113, 0861 2301541 నెంబర్లకు సమాచారం అందించి తగిన సహాయం పొందాలని కమిషనర్ తెలిపారు. రహదారులు, రోడ్లు, అండర్ బ్రిడ్జిల ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు మోటార్ల ద్వారా తోడివేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పాదచారులు, వాహన చోదకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రధాన ప్రాంతాల్లో అధికారులు పర్యవేక్షిస్తున్నారని కమిషనర్ వెల్లడించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ప్రజలు భారీ వృక్షాల సమీపంలో నిలవడం, విద్యుత్ స్తంభాలను తాకడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని కమిషనర్ సూచించారు. వరద నీరు పెరుగుతున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు కార్పొరేషన్ సూచించిన టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఐసిడియస్ ఇన్‌చార్జ్ పిడిగా సౌజన్య

**నెల్లూరు టౌన్, నవంబరు 1, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా ఐసిడియస్ ఇన్‌చార్జ్ (ఎఫ్ఎసి) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బుచ్చిరెడ్డిపాళెం సిడిపివో సౌజన్యను ఆ శాఖ ఉన్నతాధికారులు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ వరకు జిల్లా ఐసిడియస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేసిన ఉమామహేశ్వరి స్వచ్ఛంధ ఉద్యోగ విరమణ చేశారు. దీంతో అక్టోబరు మాసమంతా ప్రాజెక్ట్ డైరెక్డర్ లేకుండానే పాలన కొనసాగింది. దీంతో జిల్లాలో సీనియారిటీలో మొదటి వారిగా ఉన్న బుచ్చిరెడ్డిపాళెం సిడిపివోను పూర్తి బాధ్యతలతో జిల్లా ఐసిడియస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమించారు. అయితే సౌజన్య మంగళవారం నాటికి కూడా బాధ్యతలు చేపట్టలేదు. ఇప్పటికే ఆమె కోవూరు సిడిపివోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఒకటికి రెండు అదనపు బాధ్యతలు చేపట్టేందుకు సౌజన్య ఆలోచనలలో పడినట్లు సమాచారం.

## విద్యుత్‌శాఖ జిల్లా ఎస్‌ఇగా వెంకటసుబ్బయ్య



**నెల్లూరు నవంబర్ 1 ప్రభాతవార్త-హరనాధపురం** దక్షణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్ధ (ఏపిఎస్‌పిడిసిఎల్) జిల్లా పర్యవేక్షణాదికారిగా బి.వెంకటసుబ్బయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి సంస్ధ మేనేజింగ్ డైరెక్టర్, సిఎండి సంతోష్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాన్స్‌కో జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్‌గా ఉన్న కా ంద్ర విజయకుమార్‌రెడ్డి ఇటీవల సంస్ధ చీఫ్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతిపై తిరుపతి కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ అయిన నేపథ్యంలో ఆయన స్ధానంలో నూతన ఎస్ఇగా వెంకటసుబ్బయ్య నియమితులయ్యారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట సుబ్బయ్య నెల్లూరు జిల్లా ఎస్ఇగా బదిలీ అయ్యారు. వెంకటసుబ్బయ్య గురువారం ఉదయం స్ధానిక విద్యుత్ భవన్‌లో భాద్యతలు స్వీకరించనునట్టు సమాచారం

## యూనివర్సిటీలో 10వేల మొక్కలు నాటడమే లక్ష్యం



**వెంకటాచలం, నవంబరు 1, ప్రభాతవార్త:** విక్రమ సింహపురి యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 10 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ సుందరవల్లి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే జగనన్న పచ్చ తోరణం పేరుతో మొక్కలు నాటే ఉద్యమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. గతంలో యూనివర్సిటీలో 2029 నాటికి 50 శాతం పచ్చదనంతో నింపి గ్రీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ప్రతి వ్యక్తి ఒక మొక్క, ఒక భూమి అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయానంద్‌కుమార్, సిడిసి సి.హెచ్.విజయ, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అల్లం ఉదయ్‌శంకర్, సుజనా నాయర్, డాక్టర్ మధుమతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు



**నెల్లూరు కలెక్టరేట్, నవంబరు 1 ప్రభాతవార్త** జిల్లావ్యాప్తంగా మంగళవారం భారీవర్షం కురుస్తోంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా జిల్లా కేంద్రమైన నెల్లూరులో కల్వర్టులు, డ్రైనేజీ కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. మంగళవారం సరాసరిన జిల్లాలో 48.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం గమనార్హం. అత్యధికంగా బోగోలు మండలంలో 138.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా వరికుంటపాడు మండలంలో 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మండలాలవారీగా అల్లూరులో 134, విడవలూరులో 114.2, ఇందుకూరుపేటలో 110.2, దగదర్తిలో 98.6, తోటపల్లిగూడూరులో 93, ముత్తుకూరులో 91.6, కొడవలూరులో 89.2, నెల్లూరుఅర్బన్‌లో 89, కోవూరులో 77.2, నెల్లూరురూరల్‌లో 74.8, వెంకటాచలంలో 67.4, బుచ్చిరెడ్డిపాలెంలో 52.4, ఉలవపాడులో 49.8, సంగంలో 47, కందుకూరులో 45.4, కావలిలో 41.8, మనుబోలులో 40.2, జలదంకిలో 38.4, రాపూరులో 37.2, ఆత్మకూరులో 36.4, ఏఎస్‌పేటలో 34.6, సైదాపురంలో 31.2, కలిగిరిలో 30.2, వింజమూరులో 27, కొండాపురంలో 24, లింగసముద్రంలో 22.8, గుడ్లూరులో 22.4, వలేటివారిపాలెంలో 21.6, పొదలకూరులో 20.4, కలువాయిలో 14.8, చేజర్లలో 13.4, మర్రిపాడులో 13.2, అనంతసాగరంలో 8.4, ఉదయగిరిలో 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. కాగా ఈ వర్షాలు మరో రెండు మూడు రోజులపాటు కొనసాగుతాయని వాతావరణశాఖ పేర్కొంది.



## సోషల్ వెల్‌ఫేర్ ఇన్‌చార్జ్ డిడిగా డిబిసిడబ్ల్యూ వెంకటయ్య



**నెల్లూరు టౌన్, నవంబరు 1, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ (ఎఫ్ఎసి) ఉప సంచాలకులుగా జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి వై.వెంకటయ్యను నియమిస్తూ జిల్లా కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వెంకటయ్య బాధ్యతలు స్వీకరించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులుగా ఉన్న ఎం.రమాదేవి వ్యక్తిగత పనులపై లండన్‌కు వెళుతూ 72 రోజుల పాటు సెలవు పెట్టినట్టు సమాచారం. ఆ శాఖ ఉన్నతాధికారులు సెలవును మంజూరు చేయడంతో ఆమె తిరిగి బాధ్యతలు స్వీకరించే వరకు పూర్తి అదనపు బాధ్యతలను సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారికి ఉన్నతాధికారులు అప్పగించారు.

# పరిపాలనా సౌలభ్యం కోసమే రాష్ట్రాల ఏర్పాటు



**నెల్లూరు కలెక్టరేట్, నవంబరు 1 ప్రభాతవార్త** రాష్ట్రాల ఏర్పాటు పరిపాలనా సౌలభ్యం కోసమేనని జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు పేర్కొన్నారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జాతీయజెండాను ఎగురవేసిన కలెక్టర్ పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శ్రీపొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జేసీ రోణంకి కూర్మనాధ్, నెల్లూరు నగర కమీషనర్ హరిత, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, డిఆర్వో వెంకటనారాయణమ్మ, నెల్లూరు ఆర్‌డిఓ మలోలాలతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రాల ఏర్పాటు పరిపాలనా సౌలభ్యం కోసమేనని...దేశంలో ఎన్ని రాష్ట్రాలు ఏర్పడ్డా..ఎన్నో భాషలు..కులాలు..మతాలున్నా మనమంతా భారతీయులేనన్నారు. మనుషులందరినీ కలిపేందుకు భాష ఒక మాధ్యమంగా ఉపయోగపడుతుందన్న చక్రధర్‌బాబు భాషారాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు కారణభూతులయ్యారన్నారు. ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావానికి ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వాసులు కావడం మనకెంతో గర్వకారణమన్నారు. ఎంతోమంది మహనీయుల త్యాగాల ఫలితే నేడు స్వాతంత్ర్య ఫలాలను దేశపౌరులుగా ప్రతి ఒక్కరూ స్వీకరిస్తున్నారన్న కలెక్టర్ మన దేశ సుపరిపాలనను ఆదర్శంగా తీసుకొని ఎన్నో దేశాలు పరిపాలన సాగిస్తున్నాయన్నారు. ఎంతో జనాభా కలిగిన మన దేశ ఎన్నికల ప్రక్రియను ఇతర దేశాలు కూడా ఆసక్తిగా గమనిస్తుండడంతోపాటు ఆచరించడం కూడా జరుగుతోందన్నారు. ఇక రాష్ట్రం అన్ని రంగాలలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్న కలెక్టర్ ప్రతి ఒక్కరూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలన్నారు. రాష్ట్రం విశాలమైన సముద్రతీరం కలిగివుండడంతోపాటు ఎంతో ఖనిజసంపద వుందన్న ఆయన వున్న వనరులను..అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్రాభివృద్ధికి-దేశాభివృద్ధికి పాటుపడేలా ముఖ్యంగా యువత ముందుకు రావాల్సి వుందన్నారు. దేశం పట్ల భక్తి..గౌరవం..శ్రద్ధతో మెలగాలన్న ఆయన దేశం గౌరవించేలా ప్రతి ఒక్కరూ మెలగాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అందరికీ ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది.. జెడ్పీ చైర్‌పర్సన్**

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ఆంధ్రరాష్ట్ర సాధన కోసం నిరాహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవిని స్మరించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై వుందన్నారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం..అహింసలతో ఆశయసాధన కోసం పొట్టి శ్రీరాములు అహర్నిశలు కృషిచేశరన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు కేవీచలమయ్య, అమరజీవి పొట్టి శ్రీరాములుపై గేయం పాడిన కృష్ణస్వామిని కలెక్టర్ తదితరులు ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్ధినీవిద్యార్ధులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ ఎంవీసుధాకర్, జిల్లాపరిషత్ సీఈఓ చిరంజీవి, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరక్టర్ కేవీసాంబశివారెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరక్టర్ వెంకట్రావ్, జిల్లా పంచాయితీ అధికారి ధనలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమశాఖాధికారి కనకదుర్గాభవాని, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పెంచలయ్య, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనర్ చందర్, పంచాయితీరాజ్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ రంగవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివి



**వెంకటాచలం, నవంబరు 1, ప్రభాతవార్త:** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రెండ కళ్లు లాంటివని, అవి రాజీ లేకుండా ప్రతి పేదవానికి నేరుగా అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దక్కిందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కాకుటూరు గ్రామంలో జోరు వానలో కూడా ప్రతి ఇంటికి గడప గడప కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల ముంగిటకే పథకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి పేదవానికి రాజకీయాలకతీతంగా పథకాలను నేరుగా వారి ఖాతాలో జమ చేయడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి గ్రామంలోనే అధికారులు, సచివాలయ సిబ్బంది సమస్యలు లేకుండా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణికి మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. జోరు వానలో కూడా ప్రతి గడపకు వెళ్లి వారిని పేరు పేరును ఆప్యాయంగా పలకరించడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

కాకుటూరు గ్రామంలో పూర్తి స్థాయిలో సిమెంటు రోడ్లు, కాలువలు ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు నేరుగా అందజేశారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, తహసీల్దారు నాగరాజు, సర్పంచు దబ్బుగుంట వెంకమ్మ, కుంకాల ఏడుకొండలు, పాశం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌తో బేటీ అయిన ఏపీఈడబ్ల్యుఐసీ ఎండీ



**నెల్లూరు కలెక్టరేట్, నవంబరు 1 ప్రభాత వార్త** ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌళిక వసతుల అభివృద్ధి సంస్ధ (ఏపీఈ డబ్ల్యుఐసీ) మేనేజింగ్ డైరక్టర్ దీవన్‌రెడ్డి మంగళ వారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబుతో బేటీ అయ్యారు. క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసిన ఆయన కలెక్టర్, జాయింట్‌కలెక్టర్ రోణంకి కూర్మనాధ్‌లతో పలు విషయాలపై చర్చించారు. ముఖ్యంగా ముత్తుకూరు మండలంలోని నేలటూరు, నేలటూరుపాలెం గ్రామాలలో వివిధ కంపెనీల ఏర్పాటుకై భూములు ఇచ్చిన ప్రజలకు నెల్లూరురూరల్ మండలం మాదరాజుగూడూరు, ధనలక్ష్మీపురంలలో సేకరించిన భూములలో చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణాలపై..మౌళిక వసతులు, పునరావాస ఏర్పాట్లపై దీవన్‌రెడ్డి వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యుఐసీ చీఫ్ ఇంజనీర్ గోపీచంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు హనుమంతరావు, శ్రీనివాసకుమార్‌లు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఎక్కిన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి



**బుచ్చి నవంబర్ 1 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి స్వయంగా చెత్త ట్రాక్టర్ నడుపుతు కనిపించారు. జొరువానలో సైతం ఆయన కార్మికులతో కలిసి పనిచేస్తు ప్రజలకు తడి చెత్త,పొడిచెత్తపైన అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు చెత్తను రోడ్డులో పారివేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలని ఆయన కోరారు.

# పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు రాజేశ్వరి అలియాస్ దేవక్క





**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 1, ప్రభాతవార్త:** సిపిఐ, ఎంఎల్, పిడబ్ల్యూజి మావోయిస్టు, గతంలో తూర్పు డివిసి, ఎల్లవరం దళంలో ఏరియా కమిటీ సభ్యురాలిగా పని చేసిన శ్రీరామోజు రాజేశ్వరి అలియాస్ దేవక్క అలియాస్ లక్ష్మీ నెల్లూరు జిల్లా ఎస్పీ విజయరావు ఆధ్వర్యంలో మంగళవారం పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లోని కాన్ఫరెన్స్ హాల్ వద్ద లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆమెకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ప్రకారం లొంగిపోయిన శ్రీరామోజు రాజేశ్వరి నాలుగు లక్షల రూపాయల రివార్డును అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈమె గుంటూరు జిల్లాలోని తాడికొండ మండలం, అదే గ్రామంలోని శివాలయం వీధిలో పుట్టి పెరిగారని, 1974 సంవత్సరంలో శ్రీరామోజు నరేంద్ర అలియాస్ సుబ్బన్న, నెల్లూరు జిల్లాలోని కావలి మండలం, సత్యవోలు అగ్రహారం గ్రామానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంది. 1979-83 మధ్య కాలంలో రాజేశ్వరి భర్తతో పాటు పిడబ్ల్యూజి సాంస్కృతిక, మహిళ, పట్టణ కార్యకలాపాలలో పాల్గొందని తెలిపారు. 1984 సంవత్సరంలో సీనియర్ నాయకుల సూచనల మేరకు భర్తతో కలిసి రాజేశ్వరి అజ్ఞాతంలోకి వెళ్లాలని నిర్ణయించుకుని వాళ్ల ఇద్దరు కొడుకులను గుంటూరు హాస్టల్‌లో వదిలిపెట్టి డెన్స్ నిర్వహణ కోసం ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర జిల్లాలకు వెళ్లిందన్నారు. భర్తతో కలిసి ముందుగా తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో, తరువాత విశాఖపట్నంలో పార్టీకి డెన్ కీపర్లుగా పని చేసే సమయంలో సీనియర్ కేడర్‌లకు ఆశ్రయం ఇవ్వడం, పార్టీ రహస్య సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లు చేయడం, దళ సభ్యులకు, నాయకులకు వైద్య సహాయం అందించడం, ఆయుధాల నిర్వహణ, పార్టీ నిర్వహణ లాంటి కార్యకలాపాల్లో పాల్గొందని పేర్కొన్నారు. 1987లో నరేంద్ర, దేవక్క డీసీ నిర్వహణలో ఉన్నప్పుడు మరో ఐదుగురు నక్సలైట్లతో పాటు అధిక మొత్తంలో ఆయుధాలు, మందు గుండు సామగ్రితో కాకినాడలోని 2 టౌన్ పోలీసులు 15.12.1987న అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉంచారని వివరించారు. ఈ అరెస్టు జరిగిన 12 రోజుల్లో 27.12,1987న నక్సలైట్లు గుర్తేడు ప్రాంతంలో 8 మంది ఐఎఎస్ అధికారులను కిడ్నాప్ చేసి వారిని విడిచిపెట్టడానికి బదులుగా ఈ ఏడు మంది కేడర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారని తెలియజేశారు. 1987 డిసెంబరులో నరేంద్ర, రాజేశ్వరితో కలిపి మొత్తం 7 మంది నక్సలైట్లను విడుదల చేసి గుర్తేడు అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారని, వెంటనే నరేంద్ర, రాజేశ్వరి అటవీ ప్రాంతం యుజిలుగా మారి తూర్పు డివిసి ఎల్లవరం దళంలో చేరారు. నరేంద్ర సుబ్బన్న పేరు మీదు, రాజేశ్వరి దేవక్క పేరు మీద ఎల్లవరం దళంలో ఎసిఎం (ఏరియా కమిటీ సభ్యులు) హోదాలో కూడా పనని చేశారని వెల్లడించారు. ఈ కాలంలో రాజేశ్వరి అలియాస్ దేవక్క హత్య, బస్సు దహనం, ప్రభుత్వాస్తులు ధ్వంసం లాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాలు పంచుకుందని తెలిపారు. రంపచోడవరం సబ్ డివిజన్ (ఆనాటి తూర్పు గోదావరి జిల్లా) లోని వివిధ పోలీసుస్టేషన్‌లలో సుమారు 10 కేసుల్లో ఈమె నిందితురాలు అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈమె పేరు మీద రూ.4 లక్షలు రివార్డును ప్రకటించిందని స్పష్టం చేసిందన్నారు. ఆమె భర్త శ్రీరామోజు నరేంద్ర అలియాస్ సుబ్బన్న 16.09.2018న గుండెపోటుతో మరణించారన్నారు.

**లొంగిపోవడానికి కారణాలు** 2018వ సంవత్సరంలో ఆమె భర్త నరేంద్ర అలియాస్ సుబ్బన్న చనిపోవడం, ఇటీవల కాలంలో కొంతమంది సీనియర్ మావోయిస్టు కేడర్‌లు లొంగిపోవడం చూసి లొంగిపోయి స్వేచ్ఛా జీవితం గడపడానికి నిర్ణయించుకుందని, అలాగే వృద్ధాప్యం, ఆరోగ్య సమస్యల కారణంగా లొంగిపోయారని ఆమె తెలిపిందని పోలీసు అధికారులు తెలిపారు.

**జనజీవన స్రవంతిలో చేరాలని మావోయిస్టులకు కోరిన రాజేశ్వరి:** మావోయిస్టు పార్టీ ఈనాటికి పాతకాలం నాటి పట్టిన భావజాలాన్ని పట్టుకుని వేలాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల మద్ధతును కోల్పోతున్నందున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలీసులు మావోయిస్టు పార్టీ నాయకత్వ కేడర్‌లలోని సభ్యులు ఇతర పార్టీ సభ్యులను స్వచ్ఛంధంగా జనజీవన స్రవంతిలో చేరాలని విజ్ఞప్తి చేశారు.

## పొదలకూరులో ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ వేడుకలు



**పొదలకూరు నవంబర్ 1 ప్రభాతవార్త** పొదలకూరు పట్టణంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పంచాయితీ బస్టాండ్ ఆవరణంలోని శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర అవరణ దినోత్సవం సందర్భంగా మండల ప్రజలకు ఆర్యవైశ్యసంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అమరజీవి త్యాగ ఫలంతోపాటు అనేక మంది పోరాటాల ఫలితంగా ఏర్పాటు అయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మనందరికి స్ఫూర్తి దాయకమని అన్నారు. అదే అంకిత భావం, చిత్తశుద్ధి, దృడ సంకల్పం కొనసాగించడం ద్వారా రాష్ట్రాన్ని సంక్షేమం అభివృద్ధి పరంగా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈకార్య క్రమంలో ఆర్యవైశ్యనాయకులు అమర్తలూరు చెంచయ్య, పొట్టి సుధాకర్, చిట్లూరు సుబ్రమణ్యం, పిన్నెల ప్రభాకర్, ఆకులూరు విజయ్, ఆకులూరు హేమంత్, రమణయ్య, కామేశ్వరరావు, తరుగు సురేష్, కాకుమాని సతీష్, చాట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసిన వైద్యులు



**ఉలవపాడు, నవంబరు 1, ప్రభాతవార్త** ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఆసుపత్రిలో నూతనంగా చేరిన డాక్టర్లను ఇంఛార్జి వైద్యాధికారి సతీష్ ఎమ్మెల్యేకు పరిచయం చేశారు. గత రెండు నెలల నుండి ఆసుపత్రిలో కాన్పులు, సిజేరియన్ ఆపరేషన్స్ జరుగుతూ ఉండటం శుభపరిణామం అని, రాబోయే రోజుల్లో సాధారణ శస్త్రచికత్సలుకూడా ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరిగేలా ప్రయత్నంచేయాలని ఎమ్మెల్యే సూచించారు. గర్భవతులకు సంబంధించి అవసరం అయిన సీటీజీ మిషన్ గురించి ఎమ్మెల్యే తెలియజేయగా.. గతంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి సీటీజీ మిషన్ అందించామని, త్వరలో ఉలవపాడు ఆసుపత్రికి కూడా సీటీజీ మిషన్ అందిస్తామని చెప్పారు. గర్భవతులు స్కానింగ్ విషయంలో ఇబ్బంది పడుతున్న విషయం ఎమ్మెల్యేకి తెలియజేయగా.. వెంటనే నెల్లూరు జిల్లా డీసీహెచ్‌ఎస్ రమేష్‌తో ఫోన్‌లో మాట్లాడి.. త్వరలో కావలి నుండి స్కాన్నింగ్ మిషన్ ఉలవపాడు ఆసుపత్రికి ఇప్పించమని కోరారు. ఎమ్మెల్యే ఇచ్చిన ప్రోత్సాహంతో మరింత కష్టపడి ఉలవపాడు ఆసుపత్రిని అగ్రస్థానంలో నిలుపుతామని వైద్యులు ఎమ్మెల్యేకిచెప్పారు. వైద్యులు సతీష్, శివానంద్, మహేష్, హర్షవర్ధన్ రెడ్డి, ఐశ్వర్యలు పాల్గొన్నారు.

## మెగాజాబ్ మేళాలో ఎంపికైన జీవీఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



**ఉలవపాడు, నవంబరు 1, ప్రభాతవార్త** కమీషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుతవ డిగ్రీ కళాశాలలో గత నెల 18న నిర్వహించిన మెగా జాబ్ మేళాలలో జీవీఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉలవపాడుకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.లక్ష్మి సుధారాణి తెలిపారు. ముగ్గురు బీఏ విద్యార్థులు, ఒక బీఎస్సీ విద్యార్థి మొత్తం, నలుగురు విద్యార్థులు ఓం లాజిస్టిక్స్ లిమిటెడ్ కంపెనీకి ఎంపికైనట్లు క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.త్రినాథ్‌తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## గురునాథ్ అయ్యప్ప స్వామి ఆలయ భూమి వేలం



**విడవలూరు నవంబర్ 1 ప్రభాతవార్త** మండలంలోని విడవలూరు మండలం తుమ్మగుంట గ్రామంలో సోమవారం గురునాథ్ అయ్యప్పస్వామి వారి పదకొండున్నార ఎకరాల ఆలయ భూమి వేలంపాటనిర్వహించారు. మూడు సంవత్సరాల కొకసారి అ వేలం పాట నిర్వహిస్తారు. గతంలో ఆలయ భూములు వేలంపాట ఒకటిన్నర లక్షకు పోగా ఈ సంవత్సరం విడవలూరు గ్రామానికి చెందిన పొన్నలూరు మురళీదర్‌రెడ్డి 1లక్ష 70 వేల రూపాయాలకు వేలం పాటను దక్కించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎ ర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఇవో వరప్రసాద్, ఆలయధర్మకర్త షణ్ముఖ్ తదితరులున్నారు.

## ఆసుపత్రి రహదారికి శంఖుస్థాపన 5న




**వింజమూరు, నవంబర్ 1,ప్రభాతవార్త:** వింజమూరులోని నూతన ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళే సిసిరోడ్డుకు 5వ తేదీన శంఖుస్థాపన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఇఇ విజయభాస్కర్ మంగళవారం ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి శంఖుస్థాపనకు ఆహ్వానం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆసుపత్రతి నిర్మాణం చేపట్టి రహదారి సౌకర్యం కల్పించకుండా వదిలేశారన్నారు. దాంతో రోగులు , ఆసుపత్రి లో పనిచేసే సిబ్బంది వర్షాకాలంలో ఆసుపత్రికి వెళ్ళేందుకు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఈక్రమంలో వింజమూరు వైసిపి నాయకుల అభ్యర్ధన మేరకు ఆసుపత్రిని పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అధికారుల ప్రతిపాదనల మేరకు సుమారు 42లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు మంజూరైందన్నారు. రహదారి పూర్తయితే రోగులకు , ఇక్కడ పనిచేసే సిబ్బందికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. రహదారి ఏర్పాటుకు స్థానిక వైసిపి నాయకులు జూపల్లి రాజారావ్, మండల కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి కృషి చేశారన్నారు. ఈకార్యక్రమంలో డిఇ సాంబశివరావ్ తదితరులు పాల్గొన్నారు.

## పేర్నాటి గెలుపునకు మండల నేతలు కృషి చేయాలి



**వింజమూరు, నవంబర్ 1,ప్రభాతవార్త:** వైసిపి బలపరచిన పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి గెలుపుకు నియోజకవర్గంలోని వైసిపి నాయకులు ఐక్యంగా పనిచేయాలని మండల నేతలకు దిశ నిర్దేశం చేశారు. ఫిబ్రవరిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలని పేర్నాటి ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి బలపరచిన నాయకుడు , విద్యావంతుడు పేర్నాటి గెలుపు పట్టభద్రులకు వరమన్నారు. పట్టభద్రుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారిలో ఒకరిగా నిలిచి పోతాడన్నారు. ప్రతి ఒక్కరూ ఈనెల 7వ తేదీలోపు ఓటరుగా నమోదు చేయించుకునేలా కృషి చేయాల న్నారు. పట్టభద్రులు తమ విద్యార్హత ధృవపత్రాన్ని , ఆధార్‌కార్డ్, ఓటరు కార్డుతో తమ దరఖాస్తును అందజేసి నమోదు చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, వింజమూరు సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓట్ల నమోదును వేగవంతం చేయాలి



ఉదయగిరి నవంబర్ 1 ప్రభాతవార్త పట్టభద్రుల ఓటర్ల నమోదును సమయాన్ని దృష్టిలో వుంచుకొని వేగవంతం చేయాలని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు చింతనబోయిన శివకృష్ణ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతు టిడిపి తరపున పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్ధిగా కంచర్ల శ్రీకాంత్ పోటీ చేస్తున్నారని ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించు కోవాలని కోరారు. టిఎన్ఎస్ఎఫ్ విద్యార్ధి సంఘం నాయకులు, ఓట్ల నమోదు కార్యక్రమాన్ని మండల నాయకులతో కలిసి సమిష్టిగా అత్యధిక ఓట్లు నమోదును అసైనెడ్ చేయాలని అన్నారు. ఇప్పటికే ఓట్ల నమోదు ప్రక్రియ సగం మేర పూర్తి అయిందని మిగతాయి కూడా చేర్పించడంలో నిర్లక్ష్యం వహించకుండా 7 వ తేది లోపు ఆన్‌లైన్ చేసి మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అద్యక్షులు చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపుకు ప్రతి ఒక్కరు కట్టుబడి టిడిపి ఎంఎల్‌సి అభ్యర్ధి విజయానికి కృషి చేయాలని కోరారు.

## డాక్టర్ రామస్వామిని సత్కరించిన వాసవి క్లబ్ సెవెన్ లైన్స్



**కావలి నవంబర్01 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని డాక్టర్ రామస్వామి మల్టి సూపర్ స్పెషాలిటి చైర్మన్, ప్రముఖ ఆర్థోసర్జన్ డాక్టర్ మంచిగంటి రామస్వామిని కావలి పట్టణంలోని వాసవి క్లబ్ సెవెన్ లైన్స్ సభ్యులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. డాక్టర్ రామస్వామి వైద్యశాలకు తరలివెళ్లి ఆయనను సత్కరించి అభినందించారు. కోవిడ్-19 విపత్కర సమయంలో కావలి డాక్టర్ రామస్వామి తన వైద్యశాలలో కరోనా బాధితులకు వైద్యసేవలు అందించి ఎంతో మంది ప్రాణాలను కాపాడి ప్రాణదాతగా నిలిచారన్నారు. ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర గవర్నర్ బంగారు పథకంతో సత్కరించి అవార్డు ఇవ్వడం కావలికి గర్వకారణమన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నుంచి డాక్టర్ రామస్వామిని ఒక్కరినే ఎంపిక చేసి బంగారు పథకం అందచేయడం ఎంతైనా అభినందనీయమన్నారు. వాసవి క్లబ్ సెవెన్ లైన్స్ సభ్యు లు కర్నాటి వెంకట సుబ్బారావు, అనుమాలశెట్టి శివ, సువర్ణ హోమ్‌నీడ్స్ శ్రీనివాసులు, పాదర్తి నాగరాజు, చీదెళ్ల సత్యం, గోనుగుంట సుధీర్, దుగ్గిశెట్టి లక్ష్మణ, మనోహర్, సాయి, అచ్యుత, గిరీష్, మహేష్, పాల్గొన్నారు.

## ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం



**కందుకూరు, నవంబర్1, ప్రభాతవార్త** ఆంధ్ర రాష్ట్ర అవతరన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శాసనసభ్యుడు మానుగుంట మహీధర్‌రెడ్డి తనకార్యాలయంలో పొట్టి శ్రీ రాములు ఫోటోకి దండవేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములని పేర్కొన్నారు. ఆ యనకు గుర్తుగా నవంబర్1న రాష్ట్రఅవతరన దినో త్సవం జరుపుకోవడం గొప్పవిషయమ న్నారు. ఈ కార్యక్రమంలో రఫీ, చక్కా కేశవరావు, రెహమ తుల్లా, ప లు వురు వైసీపి నేతలు హాజరైయ్యా రు. ఎంపిడివో కార్యాలయంలో జరిగినకార్యక్రమంలో జడ్పీటీసీ టి.అనసూ ర్య, ఎంపీపీ సుశీల, పలువురు వైసీపి నేతలు పొట్టి శ్రీరాములుకు ఘననివాళ్ళుఅర్పించారు. తహశీల్దార్ కార్యాలయంలో సీతారామయ్య, మున్సిపల్ కార్యాలయంలో మనోహర్, సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ శోభిత ఆధ్వర్యంలో కార య్రక్రమం జరిగింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు విగ్ర హానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.వేణుగోపాల్‌రావు, చక్కా కేశవరావు, ఎం.వెంకటేశ్వర్లు, స్కందపురి సోమే శ్వరాలయ చైర్మన్ మోదడుగు నరసింహం, వెంకటేశ్వర్లు, బుచ్చయ్య గుప్తా, మురాహరిశెట్టి శ్రీకాం త్, స్వామి, బాలాజీ తదితరులు పెద్దఎత్తున హాజరైయ్యారు.

## స్కాలర్‌షిప్‌లకు ఆన్‌లైన్ దరఖాస్తులు

**నెల్లూరు టౌన్, నవంబరు 1, ప్రభాతవార్త:** 2022-23 విద్యాసంవత్సరానికి గాను జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న స్కాలర్‌షిప్‌లకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా నోడెల్ అధికారి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి ఎస్.కనకదుర్గా భవాని మంగళవారం తెలిపారు. ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, మెరిట్ కం మీన్స్ బేస్‌డ్ ఉపకార వేతనాల అమలుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అందులో భాగంగా ప్రీ మెట్రిక్‌కు ఈ నె 15వ తేదీ వరకు, పోస్ట్ మెట్రిక్‌కు 30వ తేదీ వరకు గడవు ఉంటుందన్నారు. స్కాలర్‌షిప్ చెల్లింపు విఫలం కాకుండా బ్యాంకు సూచనల ప్రకారం బ్యాంకు ఖాతాకు, ఆధార్, మొబైల్ లింకు అయి ఉన్న వివరాలను మాత్రమే నమోదు చేసుకోవాలన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు రిజిస్ట్రేషన్ చేసుకుని హార్డ్ కాపీని కార్యాలయానికి పంపాలన్నారు. ఇందుకు సంబంధించి విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌కు తగు సూచనలు జారీ చేయడం జరుగుతుందన్నారు.

## కలెక్టర్..జేసీలతో ఏపిఆర్‌ఎస్‌ఏ ప్రతినిధుల బేటీ



**నెల్లూరు కలెక్టరేట్, నవంబరు 1 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపిఆర్ఎస్ఏ) నేతృత్వంలో ఆరవ రాష్ట్ర రెవెన్యూ క్రీడలు గుంటూరులో జరగనున్న నేపథ్యంలో ఏపిఆర్ఎస్ఏ జిల్లా సంఘ ప్రతినిధులు, క్రీడలలో పాల్గొనే క్రీడాకారులు జిల్లా అధ్యక్షులైన అల్లంపాటి పెంచలరెడ్డి సారధ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌లను కలిశారు. రెవెన్యూ క్రీడలలో భాగంగా జోన్-3 (నెల్లూరు, ప్రకాశం, గుంటూరు)కి సంబంధించి ఇప్పటికే జరిగిన క్రికెట్ పోటీలలో గుంటూరు, ప్రకాశం జిల్లాలపై గెలుపొందిన జిల్లా జట్టు నవంబరు 11, 12, 13 తేదీలలో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు అర్హత పొందడంపై కలెక్టర్, జేసీలు అభినందనలు తెలియజేశారు. ఇక రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జిల్లాకు చెందిన రెవెన్యూ క్రీడాకారులు ముందుగా ప్రాక్టీస్ చేసుకొనేందుకు అనుమతిని కోరగా కలెక్టర్, జేసీలు అంగీకరించడం గమనార్హం. కాగా రెవెన్యూ క్రీడలకు సంపూర్ణ సహకారాలు అందిస్తున్న కలెక్టర్, జేసీ, డిఆర్వోలకు ఏపిఆర్ఎస్ఏ జిల్లాశాఖ ప్రతినిధులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కలెక్టర్, జేసీలను కలిసినవారిలో జిల్లా అధ్యక్షులు అల్లంపాటి పెంచలరెడ్డితోపాటు డేనియల్‌పీటర్, మురళి, మురళీధర్‌రాజు, అనిల్‌కుమార్‌యాదవ్, బాలకోటమ్మ, గోపీకృష్ణ, లక్ష్మీనారాయణ, నాజర్, శ్రీధర్, సందాని తదితరులున్నారు.

## జనసేన ఆధ్వర్యంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



**నెలూ ్లరు, నవంబరు1 ప్రభాతవార్త-విద్య** జిల్లాజనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా నగరంలోని స్థానిక ఆత్మకూరు బస్టాండుసెంటర్‌లోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆపార్టీ జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ చెన్నారెడ్డి, నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతు రాష్ట్రఆవిర్భావ వేడుకల్లో భాగంగా పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించటం జరిగిందన్నారు. జిల్లాకు చెందిన పొట్టి శ్రీరాములు పోరాట పటిమ, ఆత్మార్పణ వలన తెలుగువారికి రాష్ట్రం ఏర్పడటం గర్వకారణమన్నారు. దాదాపు 56రోజులు ఆమరణ నిరాహార దీక్షణు పూని పొట్టి శ్రీరాములు రాష్ట్రాన్ని సాధించారని అందటి చరిత్ర కలిగిన రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మాట్లాడుతు తెలుగుమాట్లాడే వారికి ప్రతే ్యకరాష్ట్రం కావాలని పట్టుబట్టి ఆమరణ దీక్ష చేపట్టి రాష్ట్రాన్ని పొట్టిశ్రీరాములు సాదించారన్నారు. ఆయన ఆశయసాధన కోతం యువత పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్యుడైన పొట్టి శ్రీరాములుద్వారా రాష్ట్రం సాదించుకోగలిగామని, కానీ ప్రస్తుతం వైకాపా ప్రభుత్వం ఆర్యవైశ్యులను నిలువునా మెసగిం చిందన్నారు. ఆర్యవైశ్యులకు నామమాత్రంగా ఓ కార్పోరేషన్‌ను ఏర్పాటుచేసి నిధులు ఇవ్వకుండా వారిని అవమానించటం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యత జనసేనతోనే సాద్యమన్నారు. తమ అధినేత పవన్‌కళ్యాణ్ 5 కార్పొరేషన్‌లను ప్రకటిస్తే అందులో రెండు ఆర్యవైశ్యులకు ఇవ్వటమే సమన్యాయానికి ప్రత్యక్ష్యనిదర్శనమనా న్నరు. రానున్న రోజుల్లో జనసేనను అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఆర్యవైశ్యులు కృషిచేయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గునుగులకిషోర్, నాయకులు ప్రశాంత్ యాదవ్, రవి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి సేవలు చిరస్మరణీయం: ఎంపిపి



**నెల్లూరురూరల్, నవంబరు1 ప్రభాత వార్త** ఆంధ్ర రాష్ట్ర స్థాపన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయమని మండల పరిషత్ అధ్యక్షులు బూడిద వియకుమార్ తెలిపారు. మంగళవారం నెల్లూరురూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సంద ర్భంగా ఎంపిడిఓ శైలేంద్రకుమార్‌తో కలసి అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, అమరజీవి అశయాలు అందరికీ ఆదర్శం కావాలన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాయిబాబా గుడిలో అన్నదానం



**నెల్లూరు, నవంబరు1 ప్రభాతవార్త - కల్చరల్** రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తల్లి శ్యామలమ్మ 9వవర్ధంతి సందర్భంగా నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు వద్ద ఉన్న సాయిబాబాగుడి తదితర ప్రాంతాల్లో విపిఆర్ కార్యాలయ సిబ్బంది అన్నదానం చేశారు. టిటిడి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు పేదలకు వస్త్రదానం చేశారు. ఈసందర్భంగా పలు సేవా కార్యక్రమాలు జరిగాయి.

## కండలేరులో 53.228 టీయంసీల నీటిమట్టం

**కండలేరుడ్యాం(రాపూరు), నవంబరు 01 ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో మంగళవారం ఉదయానికి 53.228 టీయంసీల నీటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో వరదనీటి రూపేణా 800 క్యూసెక్కులు, సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా 1130 క్యూసెక్కుల చోప్పున జలాశయంలోకి 1930 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వుండగా జలాశయం నుండి లోలెవల్ స్లూయిస్ నుండి 220క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుండి 200 క్యూసెక్కుల నీరు, హెడ్ రెగ్యులేటర్ నుండి సత్యసాయి గంగ కాలువలోకి 1700 క్యూసెక్కుల నీరు, పిన్నేరు వాగుకు 150 క్యూసెక్కులు, 1 వ బ్రాంచి కెనాల్‌కు 25 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2295 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగావెలుతున్నట్లు తెలిపారు.

## రాపూరులో వైభవంగా కోటి సోమవారం పూజలు



**రాపూరు, నవంబరు 01 ప్రభాతవార్త** కార్తీక మాసంలో విశేషమైన కోటీ సోమవార పర్వదినాన్ని మంగళవారం భక్తులు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువరు భక్తులు ఉదయాన్నే నది స్నానాలు ఆచరించారు. రాపూరులోని శ్రీ రామనాధేశ్వర స్వామిఆలయంలో ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, గంగాభిషేకం, విభూధాబి షేకం, పుష్పాభిషేకం, కనకాభిషేకం నిర్వహించారు. రాత్రి అకాశ దీపారాధన అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం నిర్వహించి ప్రదోష పూజలు నిర్వహించారు. తదుపరి ప్రదోష కాల అబిషేకాలు నిర్వహించారు. అలయ అర్చక స్వాములు కారంచేటి కోటేశ్వర రావు, కారంచేటి వెంకటేశ్వర్లు, కారంచేటి దుర్గాప్రసాద్, కారంచేటి రామనాధేశ్వర శర్మల ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు.

## కార్తిక దీపాలతో అలరాడిన శైవక్షేత్రం



**కలువాయి నవంబర్ 1 ప్రభాతవార్త** హరహరమహాదేవ...శంబోశంకర.... సదాశివ....పాహిమాం పాహిమాం అంటుశివాలయాలలో భక్తులు కార్తిదీపాలు పెట్టారు. కోటి సోమవారం కావడంతో కలువాయిలోని శ్రీరాజరాజేశ్వరీ సమేత దేవస్ధానం నందు మహిళలు మంగళవారం పెద్ద ఎత్తున పాల్గోని కార్తిక దీపోత్సవాలను అలంకార ప్రాయంగా వెలిగించారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పెన్నబద్వేలు లోని హరిహరులను దర్శించుకొని కార్తిక దీపోత్సవాలను వెలగించారు. జోరు వానను సైతం లెక్కడ చేయకుండా భక్తులు వేకోవ జాము నుండే నదీస్నానాలు ఆచరించి కార్తిక మాస విశిష్టతను పాటిస్తు శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలువాయిలోని శివాలయం నందు అర్చకులు నరసింహారావు ఆద్వర్యంలో భక్తులకు పూజా కార్యక్రమాల అనంతరం తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

## పొట్టి శ్రీరాములకు ఘన నివాళి



**బిట్రగుంట, నవంబరు 1 ప్రభాతవార్త** బోగోలు తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. భాషాసంయుక్త రాష్ట్రాలకు ఆయన చేసిన సేవలు స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జి.వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు గ్రామాలలో ప్రత్యేకాధికారుల నియామకం



**బిట్రగుంట, నవంబరు 1 ప్రభాతవార్త** బోగోలు మండలంలో మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్న దృష్ట్యా ముంపుకు గురయ్యే ప్రాంతాలలో పునరావాసం కల్పించేందుకు మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో గ్రామాలకు ప్రత్యేధికారులను నియమించినట్లు తహశీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. అంతకుముందు మండల ప్రత్యేకాధికారి, డ్వామా పిడి డి.వెంకట్రావు అధికారులతో సమావేశమయ్యారు.

## పొట్టి శ్రీరాములు వర్ధంతి



**అల్లూరు, నవంబరు 1 ప్రభాతవార్త** అల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం తహశీల్దార్ శ్రీరామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని అందరు గుర్తుంచుకోవాలని కోరారు. భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పణి కుమార్, ఆర్ఐ సుధీర్, మండల సర్వేయర్ అనురూఫ్, సీనియర్ అసిస్టెంట్ ప్రసూన, విఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అధిక వర్షాలను సమర్ధవంతంగా ఎదుర్కొండి

**అల్లూరు, నవంబరు 1 ప్రభాతవార్త** అల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో కావలి ఆర్డీవో శీనానాయక్ వాతావరణ శాఖ హెచ్చరికలతో మంగళవారం అధిక వర్షాలను సమర్ధవంతంగా అధికారులు ఎదుర్కొవాలని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శీనానాయక్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాతావరణ శాఖ హెచ్చరికలతో ఈ నెల 1వ తేది నుండి 4వ తేది వరకు అధిక వర్షాలు పడతాయన్న సమాచారంతో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారి కనీస అవసరాలు విద్యుత్, తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. మండల కేంద్రంలో అధికారులు అందుబాటులో వుండి అధిక వర్షాల విపత్తును సమర్ధవంతంగా ఎదుర్కొవాలన్నారు. అనంతరం రీసర్వేపై అధికారులతో సమీక్ష నిర్వహించి జగనన్న లేఅవుట్లలోని దయాకర్‌రెడ్డి లేఅవుట్‌ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీరామకృష్ణ, హౌసింగ్ ఎఇ జలీల్, హౌసింగ్ అధికారులు, ఆర్ఐ సుధీర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అమరజీవి ఆశయాల బాటలో పయనించాలి



**కావలి, నవంబరు 1 ప్రభాతవార్త** ప్రాణత్యాగం చేసి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రాన్ని తీసుకొచ్చిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాల బాటలో అందరు పయనించాలని వైశ్య నేతలు పిలుపునిచ్చారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కావలి పట్టణంలోని ట్రంకురోడ్డులో వున్న అమరజీవి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కావలి డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు, బంగారు వ్యాపార సంఘం అధ్యక్షులు నల్లూరు వెంకట రమేష్, కుదవ సంఘం అధ్యక్షులు కనమర్లపూడి వెంకట నారాయణ, వైశ్య యువ వ్యాపార నేతలు ఓరుగంటి రామకృష్ణ, రాజా గోల్డ్ అధినేత మొగళ్ళపల్లి రాజా, కొండలు, కనమర్లపూడి ప్రసాదరావు, మహంకాళి శివకుమార్, కిషోర్, మాలకొండారెడ్డి, గొల్ల సుధాకర్, మువ్వల మల్లికార్జున, వేమల శివ, గంగిశెట్టి కిషోర్, చెన్నా కొండలరావు, తదితర బంగారు, కుదవ వ్యాపారస్తులు పాల్గొని మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అమరజీవి అని గుర్తు చేశారు. తెలుగు వారి కోసం ప్రాణాలర్పించి తెచ్చిన ఆంధ్ర రాష్ట్రాన్ని ఆనాటి పాలకులు రెండు ముక్కలు చేశారన్నారు. అమరజీవి ఆశయాల బాటలో అందరు పయనించాలని పిలుపునిచ్చారు.

## నెల వారి పింఛన్లు అందజేసిన అమరా



**కావలి, నవంబరు 1 ప్రభాతవార్త** కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు 33వ వార్డులో వాలంటీర్ల ద్వారా మంగళవారం నెల వారి పింఛన్లు అందజేయడం జరిగిందని ఈ వార్డు ఇన్‌చార్జ్, మాజీ కౌన్సిలర్, వివిధ సంఘాల గౌరవాధ్యక్షులు అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా తెలిపారు. 33వ వార్డు అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నామన్నారు. అర్హులందరికి జగనన్న సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పైడా కళ్యాణి, మందా జగదీష్‌లు పాల్గొన్నారు.

## ఆంధ్ర రాష్ట్రం కోసం అశువులు బాసిన మహనీయుడు అమరజీవి



కావలి, నవంబరు 1 ప్రభాతవార్త ఆంధ్ర రాష్ట్రం కోసం అశువులు బాసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని కావలి ఎయంసి మాజీ డైరెక్టర్, కావలి జాగరీ టామరిండ్ మర్చంట్స్ అసోసియేషన్ నేత తిరివీధి ప్రసాద్ తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కందుకూరులోని అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాదర్తి నాగరాజు, పువ్వాడి శేషగిరిరావు, మద్దాడి నాగరాజు, చీదెళ్ళ మూర్తి, డాల్డా సుబ్రమణ్యం, మువ్వల బాలాజీ, అప్పల మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిని నిర్మూలిస్తే పురోగాభివృద్ధి సాధ్యమౌతుంది



**కావలి, నవంబరు 1 ప్రభాతవార్త** అవినీతిని అంతమొందించిన నాడు దేశ ఆర్థిక, సామాజిక పురోగాభివృద్ధి సాధ్యమవుతుందని కావలి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఆర్.బాలకృష్ణారెడ్డి తెలిపారు. కావలి గ్రామీణ బ్యాంక్ ఆవరణలో అవినీతి వ్యతిరేక విజిలెన్స్ వారోత్సవాలు మంగళవారం జరిగాయి. పౌరుల సమగ్రతా ప్రతిజ్ఞను నిర్వహించారు. మన దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోగాభివృద్ధికి అవినీతి అవరోధమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక ఉద్యమ కార్యకర్త యం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమన్నారు. అవినీతి రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. మహాత్మా గాంధీ కలలుగన్న అవినీతి రహిత భారతావనిని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు ఇ.నరేంద్రలక్ష్మి, బి.బి.శేషాచలం, సి.మానస, పి.వి.గాయత్రి, యం.రజని, వి.చంద్రశేఖర్, ఖాతాదారులు పాల్గొన్నారు.

## జనసేన నాయకుడు సిద్దుని అభినందించిన నాదెండ్ల మనోహర్



**కావలి, నవంబరు 1 ప్రభాతవార్త** కావలి జనసేన పార్టీ నేత, చిరంజీవి యువత అధ్యక్షుడు యం.వి.సిద్దుని జనసేన పార్టీ నేత, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ పూలబొకె అందజేసి అభినందించారు. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం యం.వి.సిద్దు, కాపు, బలిజ సంక్షేమ సంఘం కావలి అధ్యక్షులు తోట శేషయ్యలు నాదెండ్ల మనోహర్‌నుకలిశారు. కావలిలో యం.వి.సిద్దు చేస్తున్న కార్యక్రమాల్ని తెలు సుకొని ప్రత్యేకంగా అభినందించారు. కావలి పట్టణంలో పవనన్న అన్నంబండి ద్వారా ఏరియా వైద్యశాల ఆవరణలో ప్రతి రోజు వంద మంది పేదలకు సిద్దు భోజనం అందజేసి ఆకలి తీరుస్తున్నాడని నాదెండ్ల మనోహర్‌కు తెలిపారు. అంతేకాకుండా కావలి నియోజకవర్గంలో యువత మేలుకో అనే కార్యక్ర మాన్ని నిర్వహిస్తూ యువతను చైతన్యపరుస్తూ అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్ని ఇలాగే కొనసాగించాలని జనసేన పార్టీ అన్ని విధాల సిద్దుకు అండగా వుంటుందని నాదెండ్ల హామీ ఇచ్చా రు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్‌రెడ్డి, కావలి రూరల్ అధ్యక్షులు తిరుపతిస్వామి, దశరధరామిరెడ్డి, సాయి, పణి, చక్రి తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి త్యాగాలు మరువలేనివి



**జలదంకి, నవంబర్1, ప్రభాతవార్తః** భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధనకోసం అహర్నిశలు కృషిచేసి అసువులు బాసిన అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగాలు మరువలేని వని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీజ అన్నారు. స్థానిక తహసిల్‌దార్ కార్యాలయంలో మంగళవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆర్.ఐ మాట్లాడుతూ ఆమహనీయుని త్యాగాలను మనందరం స్మరించుకోవాల్సిన భాధ్యత వుందని అన్నారు. ఆయన 58 రోజులు నిరాహారదీక్ష ఫలం రాష్ట్రఅవతరణని శ్లాగించారు. ఈవేడుకలో వి.ఆర్.ఒలు, వి.ఆర్.ఎలు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుడ్లూరులో ఆంధ్రరాష్ట్రష అవతరణ దినోత్సవం



**గుడ్లూరు, నవంబర్1, ప్రభాతవార్త** మండలకేంద్రమైన గుడ్లూరులో మంగళవారం ఆంధ్రరాష్ట్ర అవతరన దినోత్సవ వేడుకలు జరిగాయి. బస్టాండ్‌సెంటర్‌లో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు సుధాకర్, పలువురు ఆర్యవైశ్య నాయకులు హాజరైయ్యారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో వచ్చే కోటి సోమవారం పర్వదినం సందర్భంగా ఆలయంలో స్వామివాఇకి ప్రాత: కాలమునే ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య రుద్రాభిషేక పూలను సాంప్రదాయ బద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ కార్యక్రమాలను అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ కార ్రమంలో ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడి దంపతులు, పచ్చిపాల శంకర్‌రెడ్డి సాయి సేవా ట్రస్టు మల్లికార్జున్‌రెడ్డి దంపతులుతో పాటు ఆంజనేయులు, నాగరాజు, జగదీష్, సాయి యశ్వంత్ , బాషా, ఆలయ చైర్మన్ బి. సురేష్, ధర్మకర్తలు పి. మోహన్, ఏ. హనుమారెడి , భక్తులు ఉన్నారు.

## తిచక్ర మోటారు వాహనాల దరఖాస్తు గడవు పెంపు

**నెల్లూరు టౌన్, నవంబరు 1, ప్రభాతవార్త:** దివ్యాంగులకు త్రిచక్ర మోటారు వాహనాలు అందజేసేందుకు గడవు పెంచనున్నట్లు దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వి.నాగరాజకుమారి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ వారిచే దివ్యాంగులకు మంజూరు చేసిన మూడు చక్రాల వాహనాల కొరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకునేందుకు నవంబరు 15 వరకు పొడిగించినట్లు తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు గమనించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0861 2329581 నెంబరును సంప్రదించవచ్చన్నారు.

## పాడి రైతులు అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత ం ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో అంతరించి పోతున్న పాల ఉత్పత్తిని ఘననీయంగా పెంచేందుకే పెయ్య దూడల పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ తెలిపారు. కోవూరులోని డీఎల్‌డీఏ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఈ పథకాన్ని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ పాడి రైతుల ఇంట సిరులు పండించేందుకే ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల మిషన్ సహకారంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఎంపిక చేసి మేలుజాతి పశువులకు సంబంధించి లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా మేలూతి పెయ్య దూడలు ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా రైతుభరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న పశు సంవర్ధక శాఖ సహాయకులు వారి వారి పరిధిలో ఉన్న పాడి రైతులు ఈ పథకం సంబంధించిన పూర్తి విషయాలను అవగాహన కల్పించి మేలు జాతి పశు ఉత్పత్తిపై చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో అంతరించి పోతున్న పాల ఉత్పత్తిని పెంపొందించేందుకే ఈ పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రైతులకు కావాల్సిన దాణాను కూడా సబ్సిడీపై అందజేయడమే కాకుండా ఈ పథకానికి సంబంధించి వీర్య నాళికలు కూడా సబ్సిడీ ద్వారా అందజేసేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పాడి రైతులు కూడా ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ బీవీ సురేష్, డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ సోమయ్య, విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమోహన్, ఇందుకూరుపేట అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మురళీలు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మాధవీలత, డీఎల్‌డీఏ డైరెక్టర్ మల్లికార్జున్‌రావు, సునీల్, పశు వైద్యులు, రైతులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన కల్పించాలి



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా బూత్ లెవల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ పద్మజ తెలిపారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుపై బీఎల్‌వోలకు అవగాహన కార్య క్రమాన్ని చేపట్టారు. నవంబర్ 7వ తేది లోగా ఈ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. గతంలో ఉన్న ఓట్లు మొత్తం తొలగించిన దృష్ట్యా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నిర్ణీత ఫారంతో ఆధార్, రెండు ఫోటోలు, విద్యార్హత సర్టిఫికేట్‌తో జతచేసి అందజేయాలన్నారు. బీఎల్‌వోలు కూడా వారి వారి పరిధిలోని ఉపాధ్యాయుల పట్టభద్రులను గుర్తించి నమోదు చేసుకునేలా దృష్టి పెట్టాలన్నారు. ఎంపీడీవో శ్రీహరి, ఎంఈవో రహీమ్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ ఉరూస్, తదితరులు ఉన్నారు.

## పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు తమ ప్రాణాలు సైతం తృణప్రాయంగా అర్పించిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మంగళవారం డీఎల్‌డీఏ కార్యాలయంలో పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆత్మార్పణ చేసి ఆ మహనీయుని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మహేశ్వరుడు, విజయ డెయిరీ చైర్మన్ కె. రంగారెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, డీఎల్‌డీఏ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ సెమయ్య, విజయ డెయిరీ ఎండీ కృష్ణమోహన్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బీవీ సురేష్, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ మాధవీలత, డాక్టర్ మురళీకృష్ణ, డీఎల్‌డీఏ డైరెక్టర్ మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

## వైభవంగా కోటి సోమవారం పూజలు



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** కార్తీక మాసంలో వచ్చే కోటి సోమవారం పర్వదినం సందర్భంగా స్థానిక కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం మహిళా భక్తుల కార్తీక దీపాల వెలుగులో సంతరించుకుంది. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి. సురేష్, ధర్మకర్తలు పి. మోహన్, ఏ. హనుమారెడ్డి, భక్తులు ఉన్నారు.

## కార్పొరేషన్‌లో ఒకరికి కారుణ్య నియామకం



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 1, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థలో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన వారి కుటుంబసభ్యులకు జీవన భద్రత కల్పించే దిశగా కమిషనర్ డి.హరిత మంగళవారం కారుణ్య నియామకాన్ని చేపట్టారు. పబ్లిక్ హెల్త్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ మరణించిన శ్రీకంఠం సుబ్బారావు అనే కార్మికుని కుటుంబ సభ్యుడైన శ్రీకంఠం శివకుమార్‌కు కార్పొరేషన్‌లో ఆయిలర్‌గా బాధ్యతలు కల్పిస్తూ కమిషనర్ కారుణ్య నియామక ఉత్తర్వులను అందజేశారు. విధి నిర్వహణలో అనునిత్యం బాధ్యతాయుతంగా వ్యవ హరించాలని నూతన సిబ్బందికి కమిషనర్ సూచించారు.

## ఘనంగా ఆంధ్ర రాష్ట్రష అవతరణ వేడుక



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 1, ప్రభాత వార్త:** ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి శ్రీ పొట్టిశ్రీరాములుకు నెల్లూరు జిల్లా ఎస్పీ విజయరావు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం 56 రోజులు నిరాటంకంగా దీక్ష చేసిన మహనీయుడు అమరజీవి అని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్రం కోసం తనను తాను బలిదానం చేసుకున్న గొప్ప త్యాగమూర్తి అని, ఆయన చేసిన కృషి దీక్ష ఫలితమే ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని వివరించారు. బాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయులని పేర్కొన్నారు. పొట్టిశ్రీరాములు చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరు గుర్తించి స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, డిపివో, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అమరజీవికి మేకపాటి నివాళులు




**ఉదయగిరి నవంబర్ 1 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శ్రీపొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పొట్టి శ్రీరాములు వారి ఆమరణ నిరాహారదీక్ష ప్రాణ త్యాగం వలన తెలుగు వారికోసం ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందని అన్నారు. ప్రతి ఒక్క తెలుగువారి కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మండల కన్వీనర్ అక్కిరెడ్డి బాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ ముత్తుజా, వైసిపి నాయకులు గడియాల్సి యజ్దాని, గొల్లపల్లి తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వర్షం వచ్చినా తగ్గేదేలేదు



**బుచ్చి నవంబర్ 1 ప్రభాతవార్త** గడపగడపకు కార్యక్రమాన్ని వర్షం వచి ్చనా ఆపేదిలేదని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి అన్నారు .మండలం లోని కాగులుపా డు, శ్రీరంగ రాజ పురం గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆ యన వర్షాన్ని సైతం లెక్క చేయ కుండా ప్రతి ఇంటికి వెళ్లి గడపగ డపకు మన ప్రభుత్వం కార్యా క్ర మాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన 21 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని, 7 లక్షల రూ పాయాలతో మిని వాటర్ ప్లాంట్ ప్రారంచారు. అనంతరం ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో 62 లక్షల 33 వేల మందికి పెన్షన్లు ఇస్తు్తన్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు సైతం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు దత్త పుత్రుడు అప్పుడప్పుడు చుట్టపు చూపుగా అమరావతికి వచ్చి వైసిపి నాయకుల్ని తిట్టిపోతుంటాడని ఆయన ఎద్దేవ చేశారు. భారదేశంతో ఏ ముఖ్య మంత్రి చేయని విధంగా సంక్షేమ పదకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు. కాగులుపాడు గ్రామంలో జోరు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అద్యక్షులు దొడ్డం రెడ్డి నిరంజ న్‌బాబురెడ్డి, వైసిపి నాయకులు మాజీ పెన్నాడెల్టా ప్రాజక్టు చైర్మన్ యర్రంరెడ్డి గోవర్దన్‌రెడ్డి, తహసిల్దారు ప్రమీలా, ఎంపిడిఒ నరసింహరావు, బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక చైర్మన్ మోర్ల సుప్రజ, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, మండల పార్టీ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, సిఐ చిట్టేం కోటేశ్వరరావు, ఎస్ఐ వీరప్రతాప్, టంగుటూరు మల్లికార్జునరెడ్డి, నగరపాలక పంచాయితీ వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, మోర్ల మురళీ, కౌన్సిలర్లు షేక్ షకిలాబేగం, చీర్ల ప్రసాద్‌యాదవ్, రాచూరు సత్యనారాయణ, కాగులుపాడు నాయకులు చీమల రమేష్‌బాబు, చీమల జనార్దన్, మాలా ్యద్రి, వేణు, వినోదుకుమార్, సెక్రటరీ అక్బర్ భాషా, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో పేర్నాటి బేటి




**ఉదయగిరి నవంబర్ 1 ప్రభాతవార్త** మండ లకేంద్రమైన ఉదయగిరిలో శాసనసభ్యులు మేక పాటి చంద్రశేఖ ర్‌రెడ్డిని వారి నివాసంలో తూర్పు రాలయసీమ పట్టుభద్రుల ఎంఎల్‌సి అభ్యర్ధి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ కలిశా రు. పట్టభద్రుల ఓట ర్ల నమోదు కార్యక్రమం గురించి వారి మద్య సు ధీర్గంగా చర్చ జరిగింది. ఉదయగిరి పరిధిలోని అన్ని మండలాలల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతుందని అన్నారు. మిగిలిన ఓటర్ల నమోదు ప్రక్రియ కూడా త్వరగా పూర్తి చేస్తామని ఎమ్మెలే ్య మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ తూర్పు రాలయసీమ అభ్యర్ధి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌కు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ అక్కిరెడ్డి బాస్కర్‌రెడ్డితోపాటు వైసిపి పట్టభద్రుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

## శివాలయాల్లో కోటి సోమవారం వేడుకలు



**కావలి నవంబర్01 ప్రభాతవార్త** కార్తీకమాసం కోటిసోమవారం ప్రత్యేక పర్వదినాన్ని పురస్కరించుకుని మంగ ళవారం భక్తులు ఒక్కపొద్దులు ఉండి శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించారు. కావలి పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి (కావలి శివాలయం) ఆల యంలో కోటిసోమవారం పూజలతో భక్తులు కిటకిటలాడారు. వర్షాన్నిసైతం లెక్కచేయకుండా పార్వతీ పర మేశ్వరులను దర్శించుకున్నారు. సాయంత్రం వర్షం తెరపివ్వడంతో ఆలయప్రాంగణం కార్తీకదీపాల వెలుగులో అలరారింది. ఆలయ అనువంశిక అర్చకులు ఏఆర్ శశిధర్ గురుకుల్ భక్తులకు సౌకర్యాలు కల్పించారు. క్యూలో భక్తులు ఆదిదంపతులను దర్శించుకున్నారు.

## మళ్లీ వైసిపిని గెలిపించాలి



**కలిగిరి, నవంబర్1ప్రభాతవార్త** ప్రజలకు అబివృద్ధిఫలాలు అందాలంటే మరలా24లో వైసిపినే గెలిపించాల్సి న ఆవశ్యకథ ఎంతైనా ఉందని ఉదయగిరి శాసన సభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గడగడ గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో బాగంగా మంగళవారం మేకపాటి కలిగిరి మండలం లక్ష్మీపురం, శిద్దనకొండూరుపంచాయితీలలో పర్యటించారు. ఆయాగ్రామాలలో గడపగడపకూ తిరుగుతూ ప్రజలకు వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా అంటూ ప్రజల్ని పలకరించారు. ఈసంద ర్బంగా లక్ష్మీపురంలో మంచినీటి కార్యక్రమానికి భూమి పుజ చేసిన మేకపాటి గ్రామాల్లో జరుగుతున్న అబివృద్ధిపనులు, ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయంటూ ప్రశ్నించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి ఇంటికి జగనన్న సంక్షేఫలాలు అందుతున్నాయన్న ఆనందంలో ప్రజలు ఉన్నారన్నారు. గతప్రభుత్వానికి , ప్రస్తుత ప్రభుత్వానికి మద్య తేడాలను ప్రజలు గమనిస్తున్నారు. 2024లో మరలా వైయస్‌జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు శిద్దంగా ఉన్నారన్నారు. ప్రభుత్వము కూడా ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనలతో ముందుకు పోతుందన్నారు.

## కలిగిరిలో వర్షం రైతన్న హర్షం

**కలిగిరి, నవంబర్ 1, ప్రభాతవార్త;**గత కొంతకాలంగా వానలు పడక పోవడంతో నిరాశగా ఎదురు చూస్తున్న రైతన్నకు చల్లటి చిరుజల్లుల రూపంలో వానలు పడి రైతుకు సంతోషాన్ని కలిగిస్తున్నారు. ఈప్రాంతరైతులు వర్షాలమీదనే ఆదారపడి పంటలు సాగుచేస్తున్నారు. చెంతనే సోమశిల ఉత్తర కాల్వ నీటితోఉరకలు వేస్తున్నా పాలకుల నిర్లక్ష్యంతో చాలా చెరువులకు నీరు పారే అవకాశం కోల్పోయాయి. దీనితో ఈ ప్రాంతరైతులు మెట్టపైర్లపై ఆదార పడి వ్యవసాయంచేసుకుంటున్నారు. ప్రస్తుతం మెట్టపైర్లనీ పొలంలో వేసిన రైతన్న వరుణదేవుడికోసం ఎదురు చూడసాగాడు. గత రెండునెల్లుగా వానలు పడక భూమిలో వేసిన పంటలు ఎం డుమొఖం పట్టాయి. మెట్టరైతు కల్పతరువైన మినుముపంట వేసి నెలరోజులు కావస్తున్నా చినుకులేక వాడు దశకు చేరింది. ఇక మిరప పంట, పెసర, పత్తిపంటలు రైతువేసినా వానలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మెట్టబంగారమైన పొగాకు పంటలకు రైతు నార్లు పోసుకొని వానలు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో గత రెండురోజులుగా పడుతున్న చిరుజల్లులు మెట్టపైరుకు ఊపిరి పోసినట్లైంది. పొగాకు రైతుకు కూడావేతకు శిద్ధపడుతున్నారు. రైతుందరికీ చేతినిండా పనిదొరకడంతో రైతుల ఆనందాలకు అవదులులేవు.

## సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు గీతాంజలి విద్యార్థి ఎంపిక



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** కేరళలో నిర్వహించనున్న సౌత్ జోన్ కబడ్డీ పోటీల్లో కోవూరు మం డలం గంగవరం గ్రామంలోని గీతాంజలి కాలేజ్‌కు చెందిన టి. పూర్ణచందు ఈ పోటీల్లో అనంతపురం జేఎన్ టీయూ విశ్వ విద్యాలయం తరఫున ఆడేందుకు ఎంపిక కావడం తమ కళాశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కోశాధికారి వై. విజయ్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు కేవలం చదువే కాకుండా సాంస్కృతిక క్రీడా పోటీల్లో కూడా ప్రత్యేక చొరవ చూపుతున్నామన్నారు. ఈ కార్య క్రమంలో మెకానికల్ విభాగాధిపతి శ్రీనివాసులు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అశోక్‌కుమార్, అసిస్టెంట్ పీడీ హరి, తదితరులు ఉన్నారు.

## కార్తీక మాసంలో గో పూజ



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** కోవూరులోని కొత్తూరు గ్రామంలో ఉన్న డీఎల్‌డీఏ ప్రాంగణంలో మంగ ళవారం కార్తీక మాసంలో వచ్చే కోటి సోమవారం పర్వదినం సందర్భంగా మేలు జాతి పశువులకు సాంప్ర దాయబద్దంగా భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి మాట్లాడుతూ ఈ మాసంలో గోవులకు పూజ చేయడం ఎంతో పుణ్య కార్యక్రమం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేలుజాతి పశువుల ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించి ఒక వినూత్న పథకానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో మేలుజాతి పశు ఉత్పత్తులపై డీఎల్‌డీఏ ఆధ్వ ర్యంలో అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు కూడా ప్రభుత్వం అంది స్తున్న ఇటువంటి మంచి కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. పశు సంవర్ధక శాఖ జా యింట్ డైరెక్టర్ డాక్టర్ మహేశ్వరుడు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఇటువంటి మంచి కార్యక్రమాన్ని పశు సంవర్ధక శాఖలో ప్రవేశపెట్టడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశం మేలుజాతి పశువులను ఉత్పత్తి చేయడం తద్వారా పాల దిగుబడిని నసీయంగా పెంచడమే అన్నారు. ఇటువంటి మంచి పథకాన్ని పాడి రైతులు అవగాహన చేసుకుని సద్వినియోగం చేసుకో వాలన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా ఒక వేళ పెయ్య దూడ పుట్టకపోతే రైతు ఇచ్చిన 500 తిరగి రైతుకు చెల్లించడ జరుగుతుందన్నారు. ఒక వేళ పెయ్య దూడ పుట్టినా రైతుకు తిరిగి 250 రూపాయలు ప్రోత్సా హంగా చెల్లించడం జరుగుతుందన్నారు. ఆర్‌బీకేలో పనిచేస్తున్న పనిచేస్తున్న సహాయకులు వారి వారి పరి ధిలో పాఇ రైతులకు అవగాహన కల్పించేలా దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా రైతుకు డీఎల్‌డీఏకు మ ధ్య అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, డీఎల్ డీఏ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ సోమయ్య, పశు సంవర్ధక శాఖ డీప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బీవీ సురేష్, విజయ డెయిరీ ఎండీ కృష్ణ మోహన్, డీఎల్‌డీఏ డైరెక్టర్ మల్లికార్జున్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ మాధవీలత, డాక్టర్ మురళీకృష్ణ, పశు వైద్యులు, రైతులు ఉన్నారు.

## బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్ధిని గెలిపించేందుకు సమిష్టి కృషి అవసరం



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** త్వరలో జరగనున్న ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజే పీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవస రం ఉందని బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవధర్ అన్నారు. కోవూరులోని రైల్వే రోడ్డులో ఉన్న గుర్రం రామయ్య కళ్యాణ మండపంలో మంగళవారం తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సం బంధించి కోవూరు నియోజకవర్గ స్థాయిలో బీజేపీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ఒక చాలెంజ్‌గా తీసుకుని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ వారి వారి పరిధిలో పట్టభద్రులను గుర్తించి యుద్ధప్రాతిపదికన వారికి ఓటు హక్కు కలిగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వినయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారం విజయలక్ష్మి, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యాక్షులు పి. సురేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షులు భరత్ కుమార్‌లు పలు విషయాలపై నాయకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్య దర్శి బి. శ్రీనివాసులు, బీజేపీ సీనియర్ నేతలు తేల్లపల్లి రాఘవయ్య, ఇంఢ్ల రాఘవేంద్ర, విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రఘురామయ్య, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని నాయకులకు పరిచయం చేశారు.

## శ్రీ మహావిష్ణువు, శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



**రాపూరు, నవంబరు 1 ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరుకు సమీపంలోని మద్దెలమడుగు వద్ద వున్న శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు, శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో మంగళవారం కోటిసోమవారం పర్వది నాన్ని పురస్కరించుకోని సామూహికసత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్బంగా తెల్ల వారుజామున శ్రీ మహావిష్ణువుకు ప్రత్యేకంగాఅభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తులచే ఆలయ అర్చక స్వాములు హర్షవర్ధన్, నాగరాజు స్వామిలు భక్తి శ్రద్దలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు, పెంచలకోన దేవస్థానం సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, రేణుకా దంపతులు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం మహావిష్ణువు ధ్వజస్థంబానికి అకాశ దీపం వెలిగించారు.




## ఓటర్ల నమోదులో అక్రమాలను అరికట్టాలి



**నెల్లూరు కలెక్టరేట్, నవంబరు 1 ప్రభాతవార్త** ఎమ్మెల్యే ఎన్నికలకు సంబందించి జరుగుతున్న ఓటర్ల నమో దులో అక్రమాలను అరికట్టాలని కోరుతూ ప్రజాసంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధులు మంగళవారం కలెక్టరేట్ పరిపాలనాధికారి షేక్. షఫీమాలిక్‌కు వినతిపత్రం అందజేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో వాలం టీర్లు పాల్గొనకూడదని ఎన్నికల కమీషన్ స్పష్టంగా ఆదేశించినప్పటికీ జిల్లాలో వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి దరఖాస్తు ఫారాలను అందజేస్తుండడం..సర్టిఫికేట్లను సేకరించడం..వాటిని సచివాలయాలలో క్రోడీకరించడం చేస్తున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్న వారు దీనిని నియంత్రించాలన్నారు. ఇక అధికారపార్టీ అండదం డలతో కొన్ని కార్పోరేట్ యాజమాన్యాలు బోగస్ సర్టిఫికేట్లతో ఓటర్ల నమోదు చేస్తున్నారన్న ప్రజాసంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధులు ఈ ప్రక్రియను అడ్డుకోవాలన్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో ప్రైవేట్ స్కూళ్ళు..కాలేజీలలో పనిచేసే టీచర్లకు కనీసం మూడు సంవత్సరాల సర్వీస్..ఆరేళ్ళపాటు పీఎఫ్ చెల్లించి వుండాలన్న నిబంధనలను పాటించుకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చి కౌంటర్ సైన్ చేయిస్తూ ఓటర్లుగా నమోదు చేస్తున్నారన్నారు. అటువంటి యాజమాన్యాలను గుర్తించి రద్దు చేయాలని..కౌంటర్ సైన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని.. దరఖాస్తు చేసిన ప్రతి ఓటును పరిశీలించాలని.. ఇవన్నీ వాలంటీర్లతో కాకుండా బూత్‌లెవల్ అధికారులతో, ప్రభుత్వ అధికారులతో చేయించాలన్నారు. అదేవిధంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే ఓటర్ల నమోదుకు విద్యార్హత సర్టిఫికేట్లపై గెజిటెడ్ అధికారుల అటెస్టేషన్ అవసరం లేని నేపధ్యంలో ఆ ప్రక్రియలోనూ అవకతవకలు జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఆ వినతిపత్రంలో పేర్కొన్న వారు నకిలీ సర్టిఫికేట్ల ముద్రణ కూడా జరుగుతోందన్నారు. ఈ నేపధ్యంలో ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను కూడా పక్కాగా పరిశీలించాలన్నారు. కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేసిన వారిలో సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.మోహన్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె.వెం కమరాజు, ఉద్యోగ సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ ఆర్.నగేష్, తిరకాల దయాకర్ తదితరులున్నారు.

## వేదగిరి పవిత్రోత్సవాలను విజయవంతం చేయండి



**నెల్లూరురూరల్, నవంబరు1 ప్రభాతవార్త** నెల్లూరురూరల్ మండలం నరసింహకొండపై వేంచేసి ఉన్న ఆదిలక్ష్మీదేవి సమేత శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 6వతేదీ నుండి 9వతేదీ వరకూ జ రుగనున్న పవిత్రోత్సవాలను విజయవంతం చేయాలని స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భక్తు లకు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని వైకాపా రూరల్ పార్టీ కార్యాలయంలో పవిత్రోత్సవాల పోస్ట ర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంప్రదాయబద్దంగా నిర్వహించే పవిత్రో త్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులకు అన్ని మౌళిక సదుపాయాలు చేకూర్చేందుకు ప్రణాళికాబద్దంగా కృషి చేయాలన్నారు. భక్తులు విరివిగా ఉత్సవాల్లో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులవ్వాలని కోరారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆల య చైర్మెన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ముఖ్యకార్యనిర్వహణాధికారి గిరిక్రిష్ణ, ఆలయ ప్రధానార్చకులు భా స్కరాచార్యులు తదితర ధర్మకర్తలు పాల్గొన్నారు.

## టీబీ, లెప్రసిలను నిర్మూలించేందుకు కృషి



**నెల్లూరు నవంబర్ 1, ప్రభాతవార్త–వైద్యం** చాపకింద నీరులా వ్యాపిస్తున్న టీబీ, లెప్రసి(కుష్ఠు), ఎయిడ్స్ లాంటి వ్యాధులను నిర్మూలించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని ట్రెనింగ్ స్టేట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కిసాన్ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ నర్సింగు సిబ్బంది, డాక్టర్లకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ టీబీ, లెప్రసి వ్యాధులను నియంత్రించేందుకు ముందుగా ఇంటింటా సర్వే చేయాలన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగిరంగు మచ్చలు, నొప్పి కలిగి ఉండేలా నరాలు, కాళ్ళు, చేతులు, కండరాల్లో బలహీనత, చేతులు, పాదాల్లో తిమ్మి ర్లు, నొప్పిలేని పుండ్లు ఉండటం, కళ్ళు పూర్తిగా మూసుకోలేకపోవడం, చర్మంపై, చెవిపై బుడిపెలుండటం లాంటి లక్షణాలున్న వారిని గుర్తించి వారందరికీ పరీక్షలు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ల డాక్టర్లు సునీల్‌బాబు, వరుణ్, డీపీహెచ్ఎస్ మంజులమ్మ, డీపీఓ వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్ వేణుగోపాల్, డీసీఎం సునీల్, నర్సింగు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీపొట్టిశ్రీరాములు విగ్రహాన్ని పార్లమెంటులో ప్రతిష్టించాలి



**నెల్లూరు నవంబర్ 1, ప్రభాతవార్త–వైద్యం** తెలుగుజాతి ప్రజల కోసం తన ప్రాణాలను సైతం తృణప్రా యం గా త్యజించిన త్యాగమూర్తి శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆయన గుర్తుగా పార్లమెంటులో ప్రతిష్టించాలని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి. శ్రీనివాసులురెడ్డి ఆయన డిమాండ్ చేశారు. మంగ ళవారం నగరంలోని ఆత్మకూరు బస్టాండు సమీపంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతికి ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి అమరజీవి అయిన శ్రీరాములు విగ్రహాన్ని ప్రతిష్టించాలని అసెంబ్లీలో తీర్మానించాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ ఆ మహానుభావుడు వల్లే సాధ్యమైందన్నారు. తన ప్రాణం పోతుందని తెలిసిన రాష్ట్రం కో సం వెనుకడుగు వేయలేదన్నారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలన్నారు. నగరంలో ఉండే స్టొన్‌హౌస్‌పేటకు పొట్టిశ్రీరాములు పేరు పెట్టాలని పేర్కొన్నారు. పేరు మార్చితినే ఆర్యవైశ్యులకు మనం తగిన గుర్తింపు ఇచ్చిన ్ట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కువ్వారపు. బాలాజీ, కొండ. ప్రవీణ్, దర్శి. హరికృష్ణ, భావన .సురేష్, బిల్లుపాటి. రవి, మీరా, ఎంసీ. సుబ్రమణ్యం, రాజా హజరత్, తంబీ. సుజన్, శేషగిరిరావు, డి.ము రళీకృష్ణ, కోట. మధు, వడమాల. రమేష్ పాల్గొన్నారు.